క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్‌లో నిర్వహణ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ×సెస్‌× పట్టణ ఏఈ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని కలెక్టరేట్, ఫిల్టర్‌బెడ్, బీఆర్‌ఎస్ భవన్, ఇండస్ట్రియల్ ఏరియా, రగుడు, కొలనూలు వ్యవసాయ ఫీడర్‌లో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి 15 మంది పోటీ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వేములవాడరూరల్ : కాంగ్రెస్ వేములవాడ రూరల్ మండల అధ్యక్ష పదవికి కొత్తగా 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. వేములవాడ రూరల్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు ఫక్రుద్దీన్, చైతన్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి మండల అధ్యక్ష పదవికి 15, గ్రామశాఖ అధ్యక్ష పదవికి వందమంది పోటీపడ్డారు. అన్ని గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు గుర్తుకురాని ప్రొటోకాల్ ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టోని మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీలో ప్రొటోకాల్ పాటించలేదంటూ కొండూరి, ఆగయ్య చేసిన ఆరోపణలను ఖండించారు.కేకేకు ప్రజలే ప్రోటోకాల్ అని వారి సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజలలోనే ఉన్నారన్నారు. తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆవేదన చెందొద్దన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ అవాకులు చెవాకులు పేలితే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, బాలు, రాజశేఖర్, శ్రీకాంత గౌడ్, రవి, మహేందర్, పరుశురాం, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం సమ్మర్ క్యాంపు శిబిరాలను హెడ్‌మాస్టర్ బొలగం శ్రీనివాస్ పరిశీలించారు. ఈనెల 1నుంచి హైస్కూల్‌లో వాలీబాల్, ఆర్ట్ అండ్ క్రాఫ్, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వాలీబాల్ క్రీడలో పీడీ ప్రభాకర్, కంప్యూటర్ కో ఆర్డినేటర్ శైలజ, ఇంగ్లిష్ రైటింగ్ సౌమ్య, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మణి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు జరుగుతున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ వివరించారు. ఉదయం, సాయంత్రం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గుంత



వేములవాడరూరల్: మున్సిపాలిటీలో విలీనమైతే సమస్యలు ఉండవని భావించిన ఆ ప్రజలు నిరాశ చెందుతున్నారు. కోనాయపల్లిలో రెండునెలల క్రితం డ్రైనేజీపై పెద్ద గుంత పడి ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై అ వార్డు ప్రజలు మున్సిపల్‌శాఖ అ ధికారులకు విన్నవించినా స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బోయినపల్లి ఎస్సైగా రాజ్‌కుమార్



బోయినపల్లి: బోయినపల్లి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా ఎస్.రాజ్‌కుమార్ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పృథ్వీధర్ గౌడ్‌ను కరీంనగర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. కాగా ప్రస్తుతం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రొబెషనరీ ఎస్సై అనిల్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు.

ముందుకుపారని మురుగు



ఐదో వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



రోడ్ల పక్కన పారుతున్న మురుగునీరు

- మండలకేంద్రంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- మురుగుకాలువల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- రోగాలబారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గాంధీవద్ద పెద్దమోరి మురుగునీరు, బస్టాండ్ ప్రాంతంలోని మురుగునీరు బైపాస్ రోడ్డు వద్దనున్న డ్రైనేజీలో కలుస్తాయి. డ్రైనేజీలో చెత్తాచెదారం వేయడంతో మురుగునీరు ముందుకు పారడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీల పక్కన ఉన్న దుకాణాల్లో దోమలబెడద విపరీతంగా పెరుగుతోంది. అనంతారం రోడ్డువైపు గ్రామం చివర ఉన్న డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి, నీరు నిలుస్తుండటంతో దుర్వాసన వస్తోందని సమీప ఇళ్ల ప్రజలు వాపోతున్నారు. ఐదో వార్డులో బండారి రామస్వామి ఇంటివైపు డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరంతా బయటకు వదులుతున్నారు. పాత వాడకట్టులోని డ్రైనేజీల నిర్వహణ సక్రమంగా లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగునీరు నిలుస్తోంది



గ్రామంలో కొన్నిచోట్ల డ్రైనేజీలు లేవు. అవసరం ఉన్న చోట నూతనంగా డ్రైనేజీ నిర్మించాలి. మురుగునీరు నిలుస్తుండటంతో దోమలు వ్యాప్తిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

– ఎర్రోజు గోపాలాచారి ఇల్లంతకుంట

డ్రైనేజీ ఏర్పాటు చేయలేదు



మావీధిలో డ్రైనేజీ ఏర్పాటు చేయలేదు. ఇళ్లలోని మురుగు నీరంతా బయటకు వెళ్లడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం దోమలబెడద పెరుగుతోంది. ఐదో వార్డులో డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.

– బండారి పరుశురాం, 5వ వార్డు

డ్రైనేజీలు శుభ్రపరుస్తున్నాం



పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం పరుస్తున్నాం. కొన్నిచోట్ల డ్రైనేజీ నిర్మాణం కూలిపోయింది. మురుగుకాలువల్లో నీరు నిలిచి ఉండటంతో దోమలు వ్యాప్తి చెందకుండా సిబ్బంది స్ప్రే చేస్తున్నారు.

– సుంకె వరుణ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం శివారు నుంచి వీర్నపల్లి మండలానికి వెళ్లే రహదారి గుంతలమయంగా తయారైంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో గుంతల్లో వర్షపునీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గుంతల రోడ్డును మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట: సెల్ నంబర్: 9440 818 864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు

తంగళ్లపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల ఆధ్వర్యంలో మండలంలోని కస్బెకట్కూర్‌లో శుక్రవారం రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ... రైతులు పంటలకు మోతాదులోనే యూరియాను వినియోగించాలని, అధిక మోతాదుతో యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు, పేడ ఎరువులను వినియోగించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక విధానం, పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, పంటలబీమా పొందే విధానం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. జి.ప్రియదర్శిని, డా. ఏ.వెంకటరామ్, ఉద్యానవన అధికారి వి.గోవర్ధన్, క్లస్టర్ అధికారి డి.హరీశ్, మండల వ్యవసాయ అధికారి కె.సంజీవ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50వేల చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లికి చెందిన ఎర్ర శోభ విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా ప్రభుత్వం తరఫున మంజూరైన రూ. 50 వేలు ఆర్థికసాయం చెక్కును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం బాధిత కుటుంబానికి అందించారు. అలాగే సెస్ ద్వారా రూ.5 లక్షల మేర ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చేర్మెన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, నాయకులు పులి లక్ష్మీపతి, అంజయ్య, వంశీ, జంగ సత్యం, అనుముల హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ కల్యాణం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోనాలను సమర్పించిన భక్తులు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, ముదిరాజ్ సంఘం బాధ్యులు జెల్ల మల్లయ్య, మధు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'క్షయ'పై అవగాహన



గర్జనపల్లిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు గర్జనపల్లిలో మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డా.సారియా అంజుమ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు.రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు.టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, ఏఎన్‌ఎంలు సుజాత, మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం



జాతీయ జెండాలతో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడఅర్బన్: పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణమని ఉపాధ్యాయులు అన్నారు. వేములవాడ జెడ్పీ బాలికల పాఠశాలలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సైన్యానికి మద్దతుగా నినాదాలు చేసి, సైనికులకు కృతజ్ఞతలు తె లిపారు. మృతులకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బన్నాజీ, మండల్ రిసోర్స్ పర్సన్ లు కమలాకర్ రెడ్డి, చక్రపాణి ,రామచంద్రం సదానందం,రాజు, కిషన్ వెంకటేశం,సీఆర్పి ఆకుల శ్రీనివాస్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీకి యత్నం

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామానికి చెందిన వొంటెల అమృతవ్వ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గ్రామానికి చెందిన అమృతవ్వ ఒక్కరే ఉండడంతో ఇంటికి తాళం వేసి చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో నిద్రిస్తుంది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. గుర్రం గోపాల్‌రెడ్డి ఇంటిలోనూ దొంగతనానికి యత్నించారు.

రమణ సార్ యాదిలో...

- 26న సంస్మరణ సభ



రమణ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: వేలాది మంది జీవితాల్లో తన పాఠాలతో వెలుగులు నింపిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కందుకూరి రమణ సంస్మరణసభను మిత్రులు సోమవారం నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే ఉపాధ్యాయుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. కందుకూరి రమణ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో జన్మించి, కామారెడ్డిలో స్థిరపడ్డారు. వృత్తి జీవితంలో తన విద్యార్థులను ఎందరినో ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం తన శిష్యులు ఎందరో దేశ, విదేశాల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడ్డారు. చాలా మంది శిష్యులు, మిత్రులు తన ప్రగతిశీల భావాలు అందుకొని పాత్రికేయులుగా రాణిస్తున్నారు. 62 ఏళ్ల వయస్సులో ఏప్రిల్ 13న కామారెడ్డిలో తుదిశ్వాస విడిచారు. రమణ జ్ఞాపకాలను స్మరిస్తూ తన మిత్రులు ఈనెల 26న ఎల్లారెడ్డిపేటలోని సాయిశివ గార్డెన్‌లో సంస్మరణసభ ఏర్పాటు చేశారు. ఈ సంస్మరణ సభకు భారీగా మిత్రులు, శిష్యులు, సహచర ఉపాధ్యాయులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

ధాన్యం చిందరవందర

కోనరావుపేట: మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం కుప్పలపై అడవిపందులు దాడిచేసి చిందరవందర చేశాయి. పని మహేశ్ అనే రైతు సుమారు 25 రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకురాగా ఇంకా తూకం వేయలేదు. శుక్రవారం తెల్లవారుజామున అడవిపందుల మహేశ్ ధాన్యం కుప్పపై అడవిపందులు దాడిచేసి చెల్లాచెదురు చేశాయి. సుమారు 10 క్వింటాళ్ల ధాన్యం నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.

'హరిత' హతం..



పాత సెస్ కార్యాలయం మూల వద్ద నరికివేసిన చెట్ల కొమ్మలు



బోయినపల్లి మార్కెట్ యార్డు దాటాక ఎండిపోయిన చెట్లు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ, కొదురుపాక, తడగొండ వైపు వెళ్లే రోడ్ల పరిసరాల్లో కొన్ని చెట్లు ఎండిపోగా మరిన్ని మంటలకు ఆహుతయ్యాయి. కొద్ది రోజులుగా మండలంలో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో సెస్ సిబ్బంది కొన్నిచోట్ల చెట్లు, కొన్నిచోట్ల చెట్లకొమ్మలు నరుకుతున్నారు. నరికివేసిన చెట్ల కొమ్మలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు విద్యుత్‌తీగల కింద మొక్కలు నాటడం మానుకుంటే ఇప్పుడు చెట్లను నరికే పరిస్థితి వచ్చేదా అని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటడం ఎందుకు..ఇప్పుడు చెట్ల కొమ్మలు నరకడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సెస్ సిబ్బంది, మండల అధికారులు సమన్వయంతో ఉండి విద్యుత్ తీగలకింద మొక్కలు నాటకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మురుగుకాల్వలు శుభ్రం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని డ్రెయినేజీలను గ్రామపంచాయతీ అధికారులు శుక్రవారం శుభ్రం చేయించారు. 'కంపు కొడుతున్న మురుగుకాల్వలు' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డ్రెయినేజీల్లో పూడిక తీసివేయించినట్లు పేర్కొన్నారు.

సాక్షి స్పందన

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోనరావుపేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ కోరారు. మరిమడ్లలో శుక్రవారం ఫీవర్ సర్వే, డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రషీద్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్‌చందు, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు కళావతి, కమలమ్మ, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా



మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో శుక్రవారం సమావేశమయ్యారు. నర్సయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులు తమ చుట్టుపక్కల ఉన్న వాగుల నుంచి ఇసుకను ఉచితంగా పొందేలా అధికారులు సహకరిస్తారన్నారు. ఇసుకకు చలాన్ లేకుండా ఉచిత సరఫరా జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకంతో కూడిన అనుమతులు తీసుకున్న లబ్ధిదారులకు ఉచిత ఇసుకను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, రాజయ్య పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు

రుద్రంగి: మండలకేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. ముదిరాజ్ మహిళలు ఇంటికో బోనంతో ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయానికి తరలివెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకొని బోనం నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మహిళలు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పదిరలో గొడ్డళ్లతో పరస్పర దాడి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరలో రెండు సామాజికవర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణపడ్డారు. గొడ్డళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన కుంబాల లక్ష్మారెడ్డి, కంచర్ల రవి గురువారం రాత్రి దాడి చేసుకున్నారు. బాధితుడు లక్ష్మారెడ్డి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర శివారులో ఇసుక తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పీఎస్సై వేముల లక్ష్మణ్ తెలిపారు. పక్క సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా, బండలింగంపల్లికి చెందిన అల్లెపు వంశీకృష్ణ ఓ వాహనంలో ఇసుకను అక్రమంగ తరలిస్తూ పట్టుబడ్డాడు. ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో వంశీకృష్ణను అరెస్టు చేసి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన యజమాని శివరాత్రి నర్సింలుపై కేసు నమోదు చేయగా.. యజమాని పరారీలో ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తంగళ్లపల్లి: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. శుక్రవారం అంకుషాపూర్, నర్సింహులపల్లె, తాడూర్‌లో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.



పోచమ్మతల్లీ కరుణించు

ముస్తాబాద్ : మండలం ఆవునూర్‌లో శ్రీమదేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, రజక సంఘం నాయకులు నక్కదాసరి రవి, పర్శరాములు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువల్లో స్ప్రే

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని మురుగు నీటి కాలువల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది స్ప్రే చేశారు. వర్షాకాలంలో డెంగీ, మల్లేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు. వైద్యసిబ్బంది ఏఎన్‌ఎం స్వప్న, ఆశావర్కర్ లక్ష్మి, తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: ✆ 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంగలనుండి రాత్రి 8.00 గంగల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899